క్లుప్తంగా

రేపు భీష్మ ఏకాదశి పూజలు

శ్రీకాళహస్తి: భీష్మ ఏకాదశి పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఉదయం 9.30గంటలకు ఊరేగింపుగా స్వామి అమ్మవార్లు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బాబు అగ్రహారం వద్ద ఉన్న కుమారస్వామి తిప్పవద్దకు చేరుకుంటారన్నారు. అక్కడ స్వామివారికి విశేష పూజలు నిర్వహించి మధ్యాహ్నం 3గంటలకు తిరిగి ఆలయానికి చేరుతారన్నారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం యువనేస్తం అసోసియేషన్ ప్రతినిధులు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత సిపాయి సుబ్రమణ్యం జన్మదినం పురస్కరించుకుని సోమవారం కాలనీలోని 38 కుటుంబాలకు ఈ వితరణ చేశారు.

ఎంపీడీఓకు సన్మానం

కేవీబీపురం: ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీఓ రామచంద్రను మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులతోపాటు సచివాలయం, వ్యవసాయశాఖ, ఉపాధి సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, లాల్‌బాబు యాదవ్, ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.

కారు బోల్తా : ఒకరికి తీవ్రగాయాలు

కేవీబీపురం: మితిమీరిన వేగంతో వస్తున్న కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టిన సంఘటన సోమవారం మండలంలోని రాగిగుంట ప్రభుత్వ పాఠశాలకు సమీపంతో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రైవేటు వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు తమిళనాడుకు చెందినదని తెలుస్తోంది. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేకాట స్థావరంపై దాడులు

వెంకటగిరి: పట్టణంలోని అమ్మవారిపేట చెరువు సమీపంలోని ముళ్లపొదల్లో పేకాటస్థావరంపై సెబ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించి ఐదుగురిని, ఒక మోటారుసైకిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. సెబ్ సీఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. అమ్మవారిపేట చెరువు ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను, వారి వద్ద నుంచి ఓ మోటారు సైకిల్, రూ.2,570 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిపై దాడి : నలుగురిపై కేసు

ఏర్పేడు: మండలంలోని పెన్నగడం ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం రాత్రి తెలిపారు. సీఐ కథనం..పెన్నగడం ఎస్సీ కాలనీలో గ్రామస్తులు నూతనంగా రామాలయ నిర్మాణానికి ఈ నెల 27న ట్రాక్టర్‌లో ఇసుక తీసుకువచ్చారు. అయితే గ్రామస్తులు ఏకాంబరం, సుందరబాబు, సుశీల, తిరుమలేశు రామాలయాన్ని నిర్మించరాదని అడ్డుకున్నారు. దీనిపై ప్రశ్నించినందుకు బాలమునిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలతో ఆనందం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో మహిళలు



శిరుణంబూదూరులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తమ పిల్లలను చదివించడమే కాకుండా పెళ్లీడుకొచ్చిన పిల్లలకు వివాహాలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకుని ఆనందంగా జీవిస్తున్నామని పలువురు మహిళలు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి చెప్పారు. సోమవారం శిరుణంబూదూరు సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల అభ్యున్నతికి వైఎస్సార్‌క్రాంతి పథం కార్యాలయం, ఐసీడీఎస్ సిబ్బంది చొరవ చూపాలని ఆదేశించారు. పంచాయతీలో మురుగు కాలువలు నిర్మించడంతో పాటు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏఈ బాలాజీని ఆదేశించారు. శిరుణంబూదూరులో అంగన్‌వాడీకీ కొత్త భవనం ఏర్పాటు చేయాలని, బాలకృష్ణాపురంలో ప్రభుత్వ గృహాలు మంజూరు స్థానికులు కోరారు.

కాదిరివేడులో సీమంతాలు

కాదిరివేడులో గర్భవతులు దివ్య, అరుణకు ఎమ్మెల్యే, ఎంపీపీ వి. ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మితో కలిసి సీడీపీఓ దేవకుమారి ఆధ్వర్యంలో సీమంతం చేశారు. అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని కిశోర బాలికలు, గర్భవతులు, బాలింతలకు పోషకాహారాన్ని ప్రభుత్వం అందజేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్రసంయుక్త కార్యదర్శి ఏవీఎం బాలాజీ రెడ్డి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కే.శ్యాంప్రసాద్ రెడ్డి, సర్పంచ్ డి.జానకి, ఎంపీటీసీలు ఎం.సుధాకర్, విడి శరవణన్, ఎంపీడీఓ బాలగణేశ్, తహసీల్దార్ టివి.సుబ్రమణ్యం, డీఈ మధుసూదన్, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, పార్టీ నాయకులు మస్తానీ, బెల్లు రమేష్, బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేవీబీపురం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఉదయం 9 గంటలకు మండలంలోని కోటమంగాపురం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తారని పార్టీ మండల కన్వీనర్ గవర్లకృష్ణయ్య తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం



మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆకర్ష్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని పెద్దకన్నలి ఎస్టీ కాలనీకి చెందిన సీ.పోలమ్మ, తొట్టంబేడు దళితవాడకు చెందిన నడిపయ్య సోమవారం అనారోగ్యంతో మరణించారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి ద్వారా మృతుల అంత్యక్రియలకు రూ.10 వేల చొప్పున అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, భక్తవత్సలం, తొట్టంబేడు సర్పంచ్ సుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి 'ఉపాధి' ఊతం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

శ్రీకాళహస్తి రూరల్: ఉపాధి హామీ పథకం పల్లె ప్రగతికి ఎంతో తోడ్పడు తోందని, ప్రతి కుటుంబమూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలని డ్వామా పీడీ సీహెచ్.శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. సోమవారం శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి పంచాయతీలో పంట కాలువ పనులను ఆయన తనిఖీ చేశారు.కూలీలు, రైతులతో మాట్లాడారు. ఉపాధి పనులు చేస్తున్న తీరును తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఈ కాలువలు పూర్తిగా పూడిపోయి పొలాలకు నీరు అందక ఇబ్బంది పడ్డామని చెప్పారు. అయితే ఉపాధి పనుల వల్ల సమస్య తీరడమేకాకుండా గ్రామంలోనే తమకు పనులు లభిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని పంట కాలువ పనులు చేసి రైతాంగానికి సమస్యలు లేకుండా చూడాలని ఉపాధి సిబ్బందిని కోరారు.సహాయ పథక సంచాలకులు ప్రేమ్ కుమార్, ఏపీఓ క్రిష్ణయ్య, జీఐఎస్ కో–ఆర్డినేటర్ గుణశేఖర్, ఈసీ మునిశేఖర్, మేట్ చిరంజీవి పాల్గొన్నారు.

ఏకం ఆలయానికి పోటెత్తిన కన్నడ భక్తులు





ఏకం ఆలయంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అమ్మాభగవాన్ దంపతులు, హాజరైన భక్తులు

వరదయ్యపాళెం: మండలంలోని ఏకం ఆలయానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వివిధ ప్రాంతాల భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఇక్కడికి కన్నడ భక్తులు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఉదయం 8 నుంచి ఆలయంలో మధ్యాహ్నం 2 గంటల వరకు దాదాపు 20వేల భక్తులు అమ్మాభగవాన్‌ను దర్శించుకున్నారు. భక్తులకు ట్రస్ట్ నిర్వాహకులు అన్ని వసతులు కల్పించారు. లోకా ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణాజీ, ఆచార్య ఆనందగిరిజీ, వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, సునీల్, ఉమాపతి, రుద్ర, శ్రీరామ్మూర్తి దాసాజీ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రత కల్పించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎంపీ సాయం



ఎంపీ ఆర్థిక సాయాన్ని నల్లరాజుకు అందజేస్తున్న ప్రసాద్‌పాల్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నల్లరాజు ప్రమాదానికి గురవడంతో సోమవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆర్థిక సాయం చేశారు. సత్యవేడు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ ప్రసాద్‌పాల్ మాట్లాడుతూ, బైక్ అదుపు తప్పి పడిపోవడంతో నల్లరాజుకు తీవ్రగాయాలయ్యాయని, సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి అందజేసిన సొమ్మును బాధితుడికి అందజేసినట్లు చెప్పారు.

కాలువలపై ఆక్రమణల తొలగింపు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న శివయ్య

ఏర్పేడు: మురుగు కాలువలపై ఆక్రమణలు తొలగించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య విజ్ఞప్తి చేశారు. ఏర్పేడు పంచాయతీలోని వీధులన్నింటా మురుగు కాలువలపై అక్రమంగా నిర్మించిన దిన్నెలు, తిన్నెలు, పెట్టిన పూలకుండీలను సోమవారం కార్మికులతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు కాలువలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



సచివాలయంలోని ఆధార్ కేంద్రం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండల కేంద్రంలోని సచివాలయం–1లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి హంస ప్రకాష్ కోరారు. కొత్త ఆధార్ కార్డులు తీసుకోదలచిన వారు, ఆధార్ కార్డులో మార్పులు–చేర్పులు చేసుకోదలచిన మండల ప్రజలు ఆధార్ కేంద్రానికి పనివేళల్లో రావాలని కోరారు.

గాంధీకి ఘన నివాళి



శ్రీకాళహస్తి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బత్తెయ్యనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీ సేవలను స్మరించారు. కార్యక్రమంలో జానీబాషా, విజయశేఖర్, శెట్టిపల్లి శివయ్య, ఈర్ల గోపి, నాగూరయ్య తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు 'జగనన్న చేదోడు'

- కులవృత్తిదారుల ఖాతాల్లోకి రూ.10వేల చొప్పున జమ
- ఆనందంలో లబ్ధిదారులు



దుస్తులు కుడుతున్న టైలర్

వరదయ్యపాళెం: కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధులు సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభించారు. ప్రతి లబ్ధిదారుడికి రూ. 10వేలు ఆర్థికసాయం చేశారు. మూడో విడత కింద సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా 877 మంది కులవృత్తుల వారు లబ్ధి పొందారు. వీరి ఖాతాల్లో రూ. 87,70,000 జమ చేశారు.

సీఎం మేలు మరువలేం



ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల వాడకం పెరగడంతో టైలర్లకు పని లేకుండా పోయింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. షాపుల అద్దె చెల్లించాలన్నా కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు ద్వారా రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఆయన మేలు మరువలేం.

–వెంకటేష్, టైలర్, చిన్న పాండూరు

కులవృత్తులకు జీవం



సెలూన్ షాపు నిర్వాహకులకు రూ. 10వేల ఆర్థికసాయం చేయడం ఆనందంగా ఉంది. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయి చాలా నష్టపోయాం. పోటీ ప్రపంచంలో కనుమరుగవుతున్న కులవృత్తులకు సీఎం జీవం పోశారు. మమ్మల్ని గుర్తించి ఆదుకుంటున్న సీఎంకు కృతజ్ఞతలు. –చిన్నా, నాయీ బ్రాహ్మణుడు, వరదయ్యపాళెం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన అధికారులతో వివిధ పథకాల అమలు, సమస్యలపై సమీక్షించారు. ఓటీఎస్, భూసర్వేలను వేగవంతం చేయాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంత కాకుండా చూడాలని ఆదేశించారు. తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం వినతి



ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కనమనంబేడులోని ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలను ఇవ్వాలని సోమవారం బీసీ, ఎస్టీ, ఎస్సీలు తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, స్థలాలు లేక ఒకే ఇంట మూడు కాపురాల వారు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలో ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిలో అర్హులైన దళితులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు స్పందిస్తూ, అర్హులందరికీ ఇంటి స్థలాలను ఇస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఫిబ్రవరి 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి ఒక ప్రకటనలో కోరారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవడానికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులతో మాట్లాడి రాజీ చేయాలని సూచించారు. ముఖ్యంగా అన్ని రకాల క్రిమినల్, సివిల్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు వంటివి పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవ శోభతో ఉత్సవమూర్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి నిత్య కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లను పలు రకాల సుగంధ పుష్పాలతో అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం గణపతి, నవగ్రహ, యజ్ఞోపవీత, మాంగల్యపూజలు చేయడంతోపాటు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై ఈఓ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆలయంలోని పరిపాలన భవనంలో ఈఓ సాగర్ బాబు ఆలయ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కలసికట్టుగా విజయవంతం చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలన్నారు.



ధూర్జటి కళాప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

మహా శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం



విద్యుత్ దీపాలంకరణ చేస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయ పాలకమండలి, అధికారులు కృషి చేస్తున్నారు. దీనికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ధూర్జటి కళాప్రాంగణం వద్ద పనులు వేగవంతం చేశారు. అలాగే పట్టణ పలు ప్రధాన మార్గాల్లో ఆర్చ్‌లను, ఆలయ సమీపంలో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు.

కుష్ఠుపై అవగాహన ర్యాలీ



బుచ్చినాయుడుకండ్రిగలో..



శ్రీకాళహస్తిలో..



చిన్న పాండూరులో ర్యాలీ..



ఏర్పేడు : పాపానాయుడుపేటలో..



తొట్టంబేడు: కాసారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...



పిచ్చాటూరు మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: కుష్ఠు రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి దివాకర్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, బత్తాయి తొక్కలా ఉండడం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లూచేతులు తిమ్మిర్లు ఎక్కడం వంటి లక్షణాలు ఉన్న పక్షంలో ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు చూపించాలన్నారు. కుష్ఠు వ్యాధి నివారణకు ఉచితంగా ఎండీటీ మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు విజయకుమారి పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. సోమవారం పాపానాయుడుపేటలో కుష్ఠుపై అవగాహన ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు గ్రామాల్లో దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలో సాలిపేటలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై డాక్టర్ జావిద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నర్సులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో...

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కారాకొల్లు, కాసారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీ జయంతి పురస్కరించుకుని ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమలు నిర్వహిస్తామని డాక్టర్లు. అనూష, చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కుష్ఠు వ్యాధికి కారణమైన సూక్ష్మజీవి, వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, తీసుకోవాల్సిన చికిత్స గురించి తెలియజేశారు. అలాగే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి దీనిపై వివరంగా తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అమ్మణమ్మ, కామరాజు, భారతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చిన్న పాండూరు సచివాలయం వద్ద స్థానికులతో కలసి వైద్యాధికారిని డాక్టర్ లావణ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి కుష్ఠుపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి అభిజ్ఞ, సిబ్బంది రాణెమ్మ, పుష్పలత, మునిలక్ష్మి, సుబ్రమణ్యం, రాజేష్ పాల్గొన్నారు.

పిచ్చాటూరులో...

పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరు జెడ్పీ హైస్కూలుతో విద్యార్థులతో పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి గాయత్రి కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శివయ్య, గురవారెడ్డి, నాగరాజు, పార్థిబన్ తదితరులు పాల్గొన్నారు.